సాక్షి ఖమ్మం

ఆదివారం । 24 । ఆగస్టు । 2025



పత్తిని దెబ్బతీసిన వాన

పది రోజుల పాటు కురిసిన వర్షాలతో పత్తి చేలు ఎర్రబారగా దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో



కమీషన్ అందక ఇక్కట్లు

రేషన్ డీలర్లకు ఐదు నెలలుగా కమీషన్ అందకపోవడంతో వివిధ రూపాల్లో నిరసన తెలిపేందుకు సిద్ధమవుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం 33° / 24°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. మధ్యాహ్నం వరకు ఉక్కబోత వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

శ్రీవారికి అభిషేకం, నిత్యకల్యాణం



న్యాయమూర్తికి శేషవస్త్రాలు అందిస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి మూల విరాట్‌తో పాటు ఆలయ ఆవరణలోని శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతంతో అభిషేకం చేశారు. ఆతర్వాత స్వామి, అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లను అలంకరించి నిత్యకల్యాణం, పల్లకీసేవ నిర్వహించారు. మధిర జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి వేముల దీప్తి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ, కోర్టు సిబ్బంది తోట వెంకన్న, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వచ్చేనెల 13న జాతీయ లోక్‌అదాలత్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి జిల్లా న్యాయమూర్తి

ఖమ్మం లీగల్: పెండింగ్‌కేసుల పరిష్కారం, కక్షిదారులకు సత్వర న్యాయమే లక్ష్యంగా వచ్చేనెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ఉమాదేవి తెలిపారు. ఖమ్మం న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శనివారం పోలీస్, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, న్యాయవాదులు, న్యాయమూర్తులతో శనివారం సమావేశమైన ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు కేసుల రాజీకి రుసుము ఉండదని, కోర్టు ఫీజు సైతం వెనక్కి ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇరువర్గాలు రాజీ పడితే సమయం ఆదా అవుతుందన్నారు. కాగా, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, మత్తు పదార్థాలతో నష్టంపై విద్యాసంస్థల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని న్యాయమూర్తి సూచించారు. న్యాయమూర్తులు అపర్ణ అర్చనకుమారి రాంప్రసాద్‌రావు, దీప, మాధవి, న్యాయవాదులు, అధికారులు బిల్ల శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, దిలీప్, గురజాల సీతారామరావు, విష్ణువందన పాల్గొన్నారు.

మైనార్టీ కళాశాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి జిల్లాలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాలల ఆర్‌సీఓ ఎం.జే.అరుణకుమారి తెలిపారు. మైనార్టీ(ముస్లింలు, క్రైస్తవులు, పార్సీలు, జైనులు, సిక్కులు) విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలోని కాలేజీల్లో ఎంపీసీ, బైపీసీ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు టీఎంఆర్ జూనియర్ కళాశాలల్లో చేరడానికి అర్హులని తెలిపారు. ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకుంటే 29న నిర్వహించే పరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాల కోసం ఖమ్మం(బాలికలు), కొత్తగూడెం(బాలురు)లోని సీఓఈ కేంద్రాల్లో లేదా 91543 65017, 78931 16918 నంబర్లలో సంప్రదించాలని అరుణకుమారి సూచించారు.

స్తంభాద్రి సహకార బ్యాంకు చైర్మన్‌గా 'ఎర్నేని'



చైర్మన్ రామారావు, డైరెక్టర్లు

ఖమ్మంవ్యవసాయం: స్తంభాద్రి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ నూతన పాలకవర్గాన్ని శనివారం ఖమ్మంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్‌గా ఎర్నేని రామారావు, వైస్ చైర్మన్‌గా దయాని వసంతకుమార్ పటేల్ ఎన్నికయ్యారు. అంతేకాక డైరెక్టర్లుగా తక్కెళ్లపాటి భద్రయ్య, ఆళ్ల మల్లికార్జునరావు, నల్లమల నవీన్‌చైతన్య, వేము ల నాగేశ్వరరావు, షేక్ హుస్సేన్, గల్లా సత్యనారాయణ, గొడవర్తి నాగేశ్వరరావు, ఈగ పుల్ల య్య, నల్లాన్‌చక్రవర్తుల బదిరీ నారాయణాచా ర్యులు, గరికపాటి విజయ్, మోదుగు నాగేశ్వరరావు, గన్నమనేని లక్ష్మి, ఎర్నేని కవిత ఎన్నికయ్యారు. సహకార శాఖ ఉద్యోగులు అవధానుల శ్రీనివాస్, మురళి ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. అనంతరం చైర్మన్ రామారావు మాట్లాడుతూ బ్యాంకు రూ.57 కోట్ల డిపాజిట్లు, రూ.100కోట్ల లావాదేవీలతో కొనసాగుతోందని తెలిపారు. ఆతర్వాత చైర్మన్‌ను డైరెక్టర్ గల్లా సత్యనారాయణ తదితరులు సన్మానించారు.

రోజంతా ఆటపాటలే!



నయాబజార్ హైస్కూల్‌లో ప్లాస్టిక్‌తో నష్టాలపై అవగాహన



కాగితాలతో కళాకృతులు చేస్తున్న ఎన్నెస్పీ కాలనీ పాఠశాల విద్యార్థినులు

ప్రభుత్వ పాఠశాలల్లో 'నో బ్యాగ్ డే'

- విద్య, వైజ్ఞానిక అంశాల్లో పోటీల నిర్వహణ
- అమలును పరిశీలించిన కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం అర్బన్/రఘునాథపాలెం: ప్రతీ నెల నాలుగో శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో 'నో బ్యాగ్ డే' అమలు చేయాలనే నిర్ణయం అమల్లోకి వచ్చింది. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచనలతో జిల్లావ్యాప్తంగా పాఠశాలల విద్యార్థులు బ్యాగ్‌లు లేకుండా వచ్చేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఈమేరకు పిల్లలు అలాగే రావడంతో రోజంతా వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించడమే కాక విద్య, వైజ్ఞానిక అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే, పర్యావరణ స్పృహ పెంపొందించేలా మట్టితో గణేష్ ప్రతిమలు, పేపర్ క్రాఫ్ట్ తయారీ నేర్పించారు. అంతేకాక మాక్ పోలింగ్ నిర్వహించి ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించారు. దీంతో విద్యార్థులు రోజంతా ఉత్సాహంగా గడిపారు.

పోటీలు.. ఆటపాటలు

ఖమ్మం శాంతినగర్ పాఠశాలలో స్పెల్ బీ పోటీలు, మట్టితో వినాయకుడి ప్రతిమ, ఇతర బొమ్మల తయారీని నేర్పించారు. అలాగే, కాగితాలు, ఆకులతో బొమ్మల తయారీపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఆపై చంద్రయాన్ ప్రయోగం, ఉన్నత స్థానాల్లో ఉన్న వారి విజయగాధల వీడియోలు ప్రదర్శించారు. ఆతర్వాత ఆటలు, పాటలు, క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించడంతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'నో బ్యాగ్ డే' నిర్వహణతో రోజంతా పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థుల్లో నూతనోత్సాహం వస్తుందని.. తద్వారా మిగతా రోజుల్లో చదువుపై శ్రద్ధ కనబరుస్తారని ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

విద్యార్థుల్లో ప్రతిభ వికాసానికే..

విద్యార్థుల అభిరుచి, ఆసక్తి ఆధారంగా ఆటలు, సంగీతం, నృత్యం, ఇతర సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించడమే 'నో బ్యాగ్ డే' ఉద్దేశమని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం ఇందిరానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఆయన వెళ్లగా విద్యార్థులు కాగితం, పూలతో చేసిన పుష్పగుచ్ఛాలు ఇవ్వగా అభినందించారు. అలాగే, విద్యార్థులు చేసిన గ్రీటింగ్ కార్డులు, పోస్టర్లు, మట్టి ప్రతిమలను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. పుస్తకాల బరువు తగ్గించి పిల్లలకు ఆసక్తి ఉన్న అంశాలను గుర్తించేలా ఉపాధ్యాయులు 'నో బ్యాగ్ డే' నిర్వహించాలని సూచించారు. అనంతరం వీ.వీ.పాలెం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు కలెక్టరేట్‌కు రాగా కలెక్టర్ అనుదీప్ వారితో మాట్లాడి కలెక్టరేట్‌లోని కార్యాలయాల కార్యకలాపాలు, అధికారుల విధులపై అవగాహన కల్పించారు. ఇక ఖమ్మం మోమినాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ పరిశీలించి మాట్లాడారు. పిల్లల్లో సామాజిక చైతన్యం కలిగించేలా వివిధ కార్యక్రమాలను నో బ్యాగ్ డే రోజున నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డీఈఓ నాగపద్మజ, ఎంఈఓ శైలజాలక్ష్మి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు శ్రీమన్నారాయణ, ఏ.రమాదేవి, శారద, డోరిస్, శైలజ, మాధవి, దాస్, వెంకటేశ్వర్లు, నగేష్, నాగులు, పుల్లయ్య, ఆదర్శ్‌కుమార్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరానగర్ పాఠశాలలో విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్ అనుదీప్



మోమినాన్ పాఠశాలలో మాక్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఆనందంగా ఉంది



మా పాఠశాలలో నో బ్యాగ్ డేను నిర్వహించారు. రోజంతా వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించడంతో అందరం ఆనందంగా పాల్గొన్నాం. ఉపాధ్యాయులు స్పెల్ బీ పోటీలు నిర్వహించారు. అలాగే, మట్టితో గణపతి విగ్రహాల తయారీని నేర్పించారు. – హేమలత, పదో తరగతి, శాంతినగర్ హైస్కూల్, ఖమ్మం

బొమ్మల తయారీ..



మా పాఠశాలలో ఆకులతో రకరకాల పక్షులు, జంతువుల బొమ్మలను తయారు చేయడాన్ని టీచర్లు నేర్పించారు. అంతేకాక అందరం కలిసి మైదా పిండితో వినాయక విగ్రహాలను తయారు చేశాం. బ్యాగ్ లేకుండా వచ్చిన మాకు కొత్త విషయాలు నేర్పించారు. – బి.సాకేత్, 4వ తరగతి, బీ.కే.బజార్ స్కూల్

చకచకా పామాయిల్ ఫ్యాక్టరీ

- ఉమ్మడి జిల్లాలో మూడో ఫ్యాక్టరీ నిర్మాణం
- కల్లూరుగూడెంలో కొనసాగుతున్న పనులు
- రైతులకు తగ్గనున్న దూరాభారం



ఫ్యాక్టరీ నిర్మాణంలో కొనసాగుతున్న పిల్లర్ల పనులు



వేంసూరు: ఉమ్మడి జిల్లాలో మూడో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. వేంసూరు మండలం కల్లూరుగూడెంలో 42 ఎకరాల్లో ఫ్యాక్టరీ నిర్మాణానికి ఉగాది పండుగ రోజున శంకుస్థాపన చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, రూ.40 కోట్ల వ్యయంతో ఈ ఫ్యాక్టరీని నిర్మిస్తున్నారు. గంటకు 15టన్నుల గెలల క్రషింగ్ చేసే సామర్థ్యం ఉంటుందని, భవిష్యత్‌లో దిగుబడి ఆధారంగా గంటకు 60 టన్నుల మేర క్రషింగ్ చేసేలా సామర్థ్యం పెంచుకోవచ్చని ఆయిల్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు.

పెరిగిన ఆయిల్‌పామ్ సాగు

జిల్లావ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగు ఏటా పెరుగుతోంది. ప్రస్తుతం 7,792 మంది రైతులు 28,685.11 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. అయితే, ఈ ఏడాది మరో 10వేల ఎకరాలు పెంచాలని అధికారులు కృషి చేస్తున్నారు. జిల్లాలోనే అత్యధికంగా సత్తుపల్లి నియోజకవర్గంలో 4,626 మంది రైతులు 17,221 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు. వేంసూరు మండలం కల్లూరుగూడెంలో ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశాక ఈ మండలంలో రైతులు ఇంకొందరు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించారు. ఆయిల్‌పామ్ దీర్ఘకాలిక పంట కావడం, చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాలు, కోతుల బెడద లేకపోవడంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

రైతులకు మేలు

ప్రస్తుతం అశ్వారావుపేటలో 30 టన్నులు, అప్పారావుపేట లో 60టన్నుల సామర్థ్యంతో పామాయిల్ ఫ్యాక్టరీలు కొనసాగుతున్నాయి. కొన్నేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగానే కాక జిల్లాలోనూ ఆయిల్‌పామ్ సాగు పెరగగా ఎక్కువగా ఈ రెండు ఫ్యాక్టరీలకే గెలలు తీసుకొస్తుండడంతో వీటిపై భారం పడుతోంది. అంతేకాక రైతులు వ్యయప్రయాసలకోర్చి ఆయిల్‌పామ్ గెలలను తీసుకెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యాన కల్లూరుగూడెంలో ఫ్యాక్టరీ అందుబాటులోకి వస్తే రైతుల ఇక్కట్లు తీరనున్నాయి. అంతేకాక స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు.

సత్తుపల్లి నియోజకవర్గంలో ఆయిల్‌పామ్ విస్తీర్ణం, రైతులు

మండలం	రైతులు	విస్తీర్ణం
సత్తుపల్లి	2,673	9,516
వేంసూరు	1,126	4,051
పెనుబల్లి	581	2,584
కల్లూరు	178	753
తల్లాడ	68	315
మొత్తం	4,626	17,221

భారం తగ్గుతుంది..



మా గ్రామంలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మిస్తుండడం సంతోషంగా ఉంది. ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయితే ఆయిల్ పామ్ గెలల తరలింపులో రవాణా భారం తగ్గుతుంది. గెలలను సులువుగా తరలించవచ్చు. స్థానికులకు ఉపాధి సైతం పెరుగుతుంది. – బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, కల్లూరుగూడెం

కూపన్ల ఆధారంగా యూరియా

- పాస్‌పుస్తకం పరిశీలించాకే జారీ
- క్యూలైన్లను తగ్గించేలా అమలుకు అధికారుల నిర్ణయం



కారేపల్లిలో రైతులకు నచ్చచెబుతున్న ఎస్‌ఐ, ఏఓ

ఖమ్మంవ్యవసాయం: కూపన్ల ద్వారా యూరియా పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సరిపడా యూరియా అందుబాటులో లేక రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. సంఘాలకు వచ్చే యూరియా కొద్దిగా ఉండడం, రైతులు ఎక్కువ కావడంతో చాలా మంది ఖాళీగా వెళ్లాల్సి వస్తోంది. ఈనేపథ్యాన రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో యూరియా పంపిణీ కేంద్రాలు, పీఏసీఎస్‌ల వద్ద రైతులు వేచి ఉండకుండా టోకెన్ల(కూపన్లు) జారీ చేయాలని ఆదేశించారు. స్టాక్ ఆధారంగా రైతులకు కూపన్లు ఇచ్చి వారే వచ్చి యూరియా తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

పాస్‌పుస్తకంతో వస్తే...

రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డుతో వస్తే ఏఈఓ, పీఏసీఎస్ సీఈఓలు పరిశీలించి భూవిస్తీర్ణం ఆధారంగా యూరియా కూపన్లు జారీ చేస్తారు. ఆ కూపన్ల ఆధారంగా గరిష్టంగా రెండు యూరియా బస్తాలు తీసుకెళ్లే వెసులుబాటు కల్పిస్తారు. అయితే, పంపిణీదారులు పలువురి పేరిట కూపన్లను పక్కదారి పట్టించే అవకాశముందని, పలుకుబడి ఉన్న వారికే ఇచ్చే ప్రమాదముందని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా, జిల్లాలో శనివారం వరకు 900 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయగా, మార్క్‌ఫెడ్ వద్ద 150మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి డి.పుల్లయ్య తెలిపారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

కారేపల్లి: సరిపడా యూరియా సరఫరా చేయడం లేదంటూ రైతులు కారేపల్లిలో శనివారం ఆందోళనకు దిగారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు ఉదయం 5గంటలకే కారేపల్లి సొసైటీ కార్యాలయం వద్దకు వచ్చారు. అయితే, యూరియా స్టాక్ లేదని, 8గంటల వరకు లారీ వస్తే పంపిణీ చేస్తామని సొసైటీ సిబ్బంది చెప్పారు. అయితే, 8గంటల వరకు ఉన్నా లారీ రాకపోగా, ఇకపై రాదని సిబ్బంది చెప్పడంతో రైతులు ర్యాలీగా వెళ్లి కుమురంభీం సెంటర్‌లో బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పనులు వదిలేసి ఉదయాన్నే వస్తే యూరియా ఇవ్వకపోవడం సరికాదని మండిపడ్డారు. దీంతో వాహనాలు నిలిచిపోగా ఎస్‌ఐ బి.గోపి, ఏఓ భట్టు అశోక్ సర్దిచెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

కమిటీల సమావేశంలో సీపీ సునీల్‌దత్



మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్, పక్కన అధికారులు

ఖమ్మంక్రైం: వినాయక నవరాత్రోత్సవాలు, నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. ఈనెల 27న వినాయక నవరాత్రులు మొదలుకానుండగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఖమ్మంలో శనివారం జరిగిన శాంతి కమిటీ, గణేష్ ఉత్సవ కమిటీల సభ్యుల సమావేశంలో సీపీ మాట్లాడారు. అతిపెద్ద ఉత్సవాల్లో ఒకటైన గణేష్ వేడుకలను గతంలో మాదిరిగానే ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఇందుకోసం పోలీసులు తీసుకునే ముందు జాగ్రత్త చర్యలకు సహకరించాలని తెలిపారు. మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ప్రైవేట్ స్థలాలైతే యజమానుల నుంచి అభ్యంతరం లేదనే పత్రం తీసుకోవాలని సీపీ చెప్పారు. అలాగే, మండపాల్లో డీజే ఏర్పాటుకు అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేశారు. కాగా, మండపాల వద్ద కమిటీ వివరాలతో ఫ్లెక్సీ ఏర్పాటుచేయాలని సీపీ సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఏసీపీలు రమణమూర్తి, శ్రీనివాస్, మహేష్, అధికారులు పాల్గొన్నారు.

డైట్‌లో ప్రవేశాలకు రెండో దశ షెడ్యూల్

ఖమ్మం సహకారనగర్: టీజీ డీఈఈ సెట్ రెండో దశ ప్రవేశాల షెడ్యూల్ విడుదలైందని ఖమ్మం ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ నాంపల్లి రాజేష్ తెలిపారు. కళాశాలల వారీగా ఖాళీలు, ఇతర వివరాలు ఈనెల 25వ తేదీన deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. ఆపై అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్ల పరిశీలన కోసం ఈనెల 26న డైట్‌లో సంప్రదించాలని సూచించారు. ఇక ఈనెల 28న ప్రైవేట్ కళాశాలల అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. ఆపై 28న సీట్లు కేటాయించనుండగా, వారు 29వ తేదీన కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాల్సిందే...

- టీఎస్ సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్
- కార్యాలయాలు, విద్యాసంస్థల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసనలో సీపీఎస్ ఈయూ నాయకులు

ఖమ్మం సహకారనగర్: గత ప్రభుత్వం జారీ చేసిన జీఓ 28ను రద్దు చేయడమే కాక పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్‌తో జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు శనివారం మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద జరిగిన నిరసనలో తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్(టీఎస్ సీపీఎస్ ఈయూ) జిల్లా అధ్యక్షులు చంద్రకంటి శశిధర్ మాట్లాడారు. తెలంగాణ ఏర్పడితే తమ జీవితాలు బాగు పడతాయని ఆశిస్తే పదేళ్లయినా ఫలితం లేదని తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సంప్రదించకుండానే తెలంగాణ సీపీఎస్ ఉద్యోగులు నూతన పెన్షన్ విధానంలోనే కొనసాగుతారని లేఖ ఇచ్చిందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉద్యోగులు వేముల శంకర్, పవన్, గిరిజా, కేశవ లక్ష్మి, అజీబాబాతో పాటు టీఎస్ టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, వ్యవస్థాపక అధ్యక్షుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

■ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.అనిల్‌కుమార్, ఎం.సురేష్ కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు.

వీఎస్ఎస్ సభ్యుల అభ్యున్నతికి కృషి

జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్



మహిళా మార్ట్‌లో ఉత్పత్తులను పరిశీలిస్తున్న సభ్యులు

ఖమ్మంవ్యవసాయం: వన సంరక్షణ సభ్యులకు ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్‌లో చేయూతనిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ తెలిపారు. సత్తుపల్లికి చెందిన వనసంరక్షణ సమితి సభ్యులు 50మందికి జీవనోపాధి మెరుగుపరిచేలా అటవీ శాఖ ఆధ్వర్యాన శనివారం టూర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని పీఎస్‌కే ఫుడ్స్, స్పైసెస్, బుర్హాన్‌పురంలోని జ్యూట్ బ్యాగ్‌ల తయారీ కేంద్రం, నాయుడుపేటలోని కొబ్బరి, తాటి ఉత్పత్తుల కేంద్రాన్ని పరిశీలించాక అటవీ శాఖ కార్యాలయంలో వారితో డీఎఫ్ఓ సమావేశమయ్యారు. వీఎస్ఎస్ సభ్యులు విస్తర్లు, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ, తేనె సేకరణలో సహకరించడమే కాక అమ్మకానికి మహిళా మార్ట్‌లో వేదిక కల్పిస్తామని తెలిపారు. సత్తుపల్లి ఎఫ్‌డీఓ మంజుల, రేంజర్లు ఉమ, స్నేహలత, టాస్క్‌ఫోర్స్ అధికారులు శ్రీనివాసరావు, కిశోర్ పాల్గొన్నారు.

● ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని మహిళా మార్ట్‌ను వీఎస్ఎస్ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్పత్తుల తయారీ, ప్యాకింగ్, అమ్మకాల వివరాలను వారికి డీఆర్‌డీఏ డీపీఎంలు వివరించారు.

క్లుప్తంగా

నేడు, రేపు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆది,సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈమేరకు ఆది వారం ఉదయం 10-30 గంటలకు ఖమ్మం 57వ డివిజన్ రమణగుట్టలో సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఆతర్వాత పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇక మంత్రి సోమవారం ఉదయం సత్తుపల్లికి, అక్కడి నుంచి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం కుంటముక్కల మీదుగా హైదరాబాద్ వెళ్లనున్నారు.

ఉత్సాహంగా అండర్-10 క్రీడాపోటీలు



స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

ఖమ్మం స్పోర్ట్స్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అండర్-10 బాలబాలికలకు శనివారం ఖమ్మంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీలను డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంచేలా పోటీలు నిర్వహించామని తెలిపారు. అథ్లెటిక్స్, స్కేటింగ్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, లాన్ టెన్నిస్, స్విమ్మింగ్ అంశాల్లో పోటీలు జరగగా చిన్నారులు ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

యంత్రాల సరఫరాకు టెండర్లు

ఖమ్మంవైద్యవిభాగం: డెంగీ ఎలీసా వాషర్, రీడర్ మిషన్ల సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ కళావతిబాయి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సీల్డ్‌టెండర్లను ఈనెల 27న మధ్యాహ్నం 3 గంటల్లోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వీటిని 28వ తేదీన పరిశీలించి అర్హత ఉన్న వాటిని ఖరారు చేస్తామని తెలిపారు.

ఉషూ జిల్లా జట్ల ఎంపిక



క్రీడాకారులతో డీవైఎస్‌ఓ, కోచ్

ఖమ్మం స్పోర్ట్స్: ఉషూ అసోసియేషన్ శనివారం నిర్వహించిన పోటీల్లో జిల్లా జట్లను ఎంపిక చేశారు. జిల్లా జట్టుకు పి.పవిత్రాచారి, డి.హర్షిణి, ఎం.హనీనిఖిల్ జోస్విన్, కె.శశి వర్షిక, టి.సాయిభవ్యశ్రీ, ఎస్.కే.ఫిరోదోస్ ఎంపికయ్యారు. వీరు ఈనెల 24న మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుండగా, డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, అసోసియేషన్ కార్యదర్శి పి.పరిపూర్ణాచారి అభినందించారు.

కాలేజీల్లో హాజరుకు 'ఎఫ్‌ఆర్‌ఎస్'

వైరా: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనూ విద్యార్థుల హాజరు నమోదుకు ఎఫ్‌ఆర్‌ఎస్(ఫేస్ రికగ్నైజింగ్ సిస్టమ్) అమలు చేయనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవిబాబు తెలిపారు. వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం తనిఖీ చేసిన ఆయన మరమ్మతు పనులను పరిశీలించారు. తరగతి గదుల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఆతర్వాత అధ్యాపకులతో సమావేశమై బోధన, హాజరు నమోదుపై సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ ఎల్.నవీన జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



సూచనలు చేస్తున్న డీఈఓ నాగపద్మజ

ముదిగొండ: పాఠశాలల్లో తరగతి గదులు, ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి నాగపద్మజ సూచించారు. ముదిగొండ మండలం మేడేపల్లి ప్రాథమిక పాఠశాల, ముదిగొండ జెడ్పీహెచ్‌ఎస్‌ను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 'నో బ్యాగ్ డే'అమలును పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేందుకు నెలలో నాలుగో శనివారం నో బ్యాగ్ డే తప్పక అమలుచేయాలని సూచించారు. ఆతర్వాత ఎంఈఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. కాగా, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును ప్రతిరోజు 11గంటల్లోపు ఎఫ్‌ఆర్‌ఎస్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఎంఈఓ రమణయ్య, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ భాస్కర్‌రావు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,052

పత్తిని దెబ్బతీసిన వాన

- అధిక వర్షాలతో చేలలో నిలిచిన నీరు
- సమగ్ర పోషకాలు అందక పూత, కాత దశలో ఎర్రబారిన చేన్లు



కల్లూరు రూరల్ : లక్ష్మీపురంలోని పత్తి చేనులో నిలిచిన నీరు

ఖమ్మంవ్యవసాయం/వైరా రూరల్: ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలు పత్తి పంటకు ప్రతికూలంగా మారాయి. అధిక వర్షాలతో చేలలో నీరు నిలిచి రోజుల తరబడి నిల్వ ఉండడంతో పైరు స్థితి మారుతోంది. తేమ కారణంగా సమగ్ర పోషకాలు అందక ఎర్రబారడమే కాక పూత, కాత రాలిపోయాయి. ఫలితంగా దిగుబడి తగ్గే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్చికి ఆశించిన ధర లేక ఈ ఏడాది రైతులు పత్తి సాగుకు ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో జిల్లా సాధారణ విస్తీర్ణం 2.15 లక్షల ఎకరాలైతే 2,25,022 ఎకరాల్లో సాగైంది. అత్యధికంగా కారేపల్లి మండలంలో 22,934 ఎకరాల్లో, రఘునాథపాలెంలో 22,179, చింతకాని మండలంలో 20,181 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. కనిష్టంగా సత్తుపల్లి మండలంలో కేవలం 215 ఎకరాల్లో పత్తి సాగైనట్లు గణాంకాలు చెబుతున్నాయి.

పది రోజుల పాటు వాన

పత్తిని మెట్ట పంటగా సాగు చేస్తారు. కొందరు వర్షాధారంగా, ఇంకొందరు నీటి వనరులు ఉన్న భూముల్లోనూ సాగు చేశారు. ఈ ఏడాది మే చివరి వారంలో కురిసిన వానలతో విత్తనాలు నాటారు. ఆపై జూన్‌లో సాధారణ వర్షపాతం కూడా లేకపోగా, జూలైలో సాధారణానికి మించి, ఈనెలలో పది రోజుల పాటు వర్షాలు కురిశాయి. పత్తి పూత, కాత దశకు చేరిన సమయంలో కరిసిన వర్షాలు పంటపై ప్రభావాన్ని చూపాయి. రోజుల తరబడి చేన్లలో నీరు నిలిచి తేమ పెరగగా పత్తికి సమగ్ర పోషకాలు అందక మొక్కలు ఎర్రబారాయి. అంతేగాక రసం పీల్చే పురుగు ఆశిస్తోంది. ఇదికాక వర్షం కారణంగా కలుపు విపరీతంగా పెరగడం రైతులను ఆవేదనకు గురిచేస్తోంది.

దిగుబడిపై ప్రభావం

అధిక వర్షాలు పంట దిగుబడిపై ప్రభావం చూపే పరిస్థితి కనిపిస్తోంది. చాలాచోట్ల పూత, కాత రాలిపోగా దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక పల్లపు నేలల్లో పత్తి బాగా దెబ్బతిన్నదని, దిగుబడులపై ఆశ లేనట్టేనని చెబుతున్నారు. సహజంగా ఎకరాకు 10 - 12 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి ఆరు క్వింటాళ్లు రావడం కూడా కష్టమేనని ఆవేదన దుతున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- వర్షపునీటినికాల్వల ద్వారా బయటకు పంపించాలి.
- ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల ఎంఓపీ(మ్యూరేట్ ఆఫ్ పొటాష్) వేస్తే నైట్రోజన్, పొటాష్ కొరత తీరుతుంది.
- యూరియా(2శాతం) లేదా మల్టీ కే (ఒక శాతం) ద్రావణం పిచికారీ చేస్తే మొక్కకు త్వరగా పోషకాలు అందుతాయి.
- కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లేదా ఒక గ్రాము కార్బాండిజం, 25 గ్రాముల మాంకోజెబ్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- వడల తెగులు గమనిస్తే కాపర్ ఆక్సీ క్లోరైడ్ మూడు గ్రాములను లీటరు నీటిలో కలిపి మొక్క మొదళ్ల తడిచేలా పోయాలి.
- రసం పీల్చే పురుగు నివారణకు పిఫ్రానిల్ లేదా ఎసిటామిప్రిడ్ మందు పిచికారీ చేయాలి.

వానతో అదనంగా పెట్టుబడి



ఈనెల మొదటి వరకు పత్తి ఆశాజనకంగా ఉన్నా వానతో చేన్లు దెబ్బతింటున్నాయి. ఈ వానలు పూత, కాతను దెబ్బతీశాయి. దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. పైర్లు తిరిగి కోలుకోవాలంటే అదనంగా పెట్టుబడి పెట్టక తప్పడం లేదు.

– సిరసవాడ వెంకటేశ్వర్లు, యదళ్లచెరువు

పూత, పిందె రాలుతోంది..



మూడెకరాల్లో పత్తి సాగు చేస్తే ఇప్పటికే పూత, పిందె దశకు చేరింది. ఇటీవల భారీ వర్షాలతో చేన్లలో నీరు చేరి వేర్లు కుళ్లిపోవడమే కాక మొక్క ఎదుగుదల తగ్గింది. పూత, పిందె రాలుతుండడంతో దిగుబడి తగ్గనుంది. పెట్టుబడి వచ్చే పరిస్థితి కనబడడం లేదు.

– కోసూరి వెంకటరమణ, పాలడుగు

సమగ్ర యాజమాన్య చర్యలతో...



అధిక వర్షాలతో పంట భూముల్లో నీరు నిలిచి పత్తి ఎర్రబారింది. వానల కారణంగా చేన్ల నీరు నిలవడం వల్ల పైరుకు సమగ్ర పోషకాలు అందక ఎర్రబారాయి. సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా పైర్లు తిరిగి పురోగతి సాధిస్తాయి.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

పేద ప్రజల గొంతుక.. సురవరం

సంతాపసభలో సీపీఐ నాయకులు



సుధాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, అధ్యాపకులు

ఖమ్మంమయూరిసెంటర్: పేద, కార్మిక వర్గాల సమస్యలను చట్టసభల్లోనే కాక పలు వేదికలపై వినిపించిన సురవరం సుధాకర్‌రెడ్డి ప్రజల గొంతుకగా నిలిచారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎంపీ సుధాకర్‌రెడ్డి మృతి చెందగా, ఆయన సంతాపసభ శనివారం ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సురవరం చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించాక జితేందర్‌రెడ్డి మాట్లాడారు. పార్లమెంటరీ వ్యవస్థలో గొప్పవిగా చెప్పుకునే 18ఏళ్లకే ఓటు హక్కు, సమాచార హక్కుచట్టం, ఉపాధి హామీ పథకం సాధనలో సురవరం కీలక భూమిక పోషించారన్నారు. ఖమ్మం జిల్లాతో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తుచేశారు. ఈ సభలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్దినేని కర్ణకుమార్, నాయకులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, పుచ్చకాయల కమలాకర్, వై.సాంబశివరెడ్డి, కూచిపుడ్డి రవి, నూనె శశిధర్, వరద నర్సింహారావు, ఎస్.కే.సైదా తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యాన ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో సురవరం సంతాప సభ నిర్వహించగా నాయకులు రావి శివరామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రిన్సిపాల్ రామారావు పాల్గొన్నారు.

పలువురు నేతల నివాళి

ఖమ్మం వైరారోడ్: సీపీఐ జాతీయ నేత సురవరం సుధాకర్‌రెడ్డి మృతిపై వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం ప్రకటించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావుతో పాటు నాయకులు తాతా మధుసూదన్, బాగం హేమంతరావు, దండి సురేష్, మహ్మద్ మౌలానా, పోటు రంగారావు, నున్నా నాగేశ్వరరావు వేరువేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

'భగీరథ' కార్మికుల సమ్మె విరమణ



నాయకులతో చర్చిస్తున్న సీఈ శ్రీనివాసరావు

కూసుమంచి/వైరా: నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో మిషన్ భగీరథ కార్మికులు జిల్లా వ్యాప్తంగా శనివారం సమ్మెకు దిగారు. ఇందులో భాగంగానే కూసుమంచి మండలంలోని పాలేరు, వైరా రిజర్వాయర్ సమీపాన సబ్ స్టేషన్ వద్ద కార్మికులు ఆందోళన చేపట్టారు. వైరాలో కార్మికులు మూడు గంటల పాటు ఆందోళన చేపట్టగా భగీరథ సీఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులందరికీ నాలుగు నెలల వేతనాలను విడతలవారీగా వచ్చేనెల 15లోగా జమ చేస్తామని హామీ ఇచ్చారు. దీనికితోడు జేఏసీ నాయకులతో అధికారులు జరిపిన చర్చలు సఫలం కావటంతో సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కార్మికులు విధులకు హాజరై నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఆందోళనలో బీఆర్‌టీయూ ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ నాయకులు రవి, రాములు, అనంతరాములు, బాలకృష్ణ, రాంబాబు, వెంకయ్య పాల్గొన్నారు.

కమీషన్ అందక ఇక్కట్లు



ఖమ్మంలో మాట్లాడుతున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

ఖమ్మం సహకారనగర్/ నేలకొండపల్లి: ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు నెలనెలా బియ్యం పంపిణీ చేసే డీలర్లకు కమీషన్ సక్రమంగా అందడం లేదు. ప్రభుత్వం నుంచి వచ్చే కమీషన్ ఐదు నెలలుగా బకాయి ఉండడంతో నెలవారీఖర్చులకు అవస్థపడుతున్నామని వాపోతున్నారు. ఏప్రిల్, మే నెలకు సంబంధించి రాష్ట్ర కమీషన్ విడుదలైనా ఆతర్వాత రాలేదని, కేంద్రం నుంచి మాత్రం ఐదు నెలలుగా విడుదల కాలేదని చెబుతున్నారు.

క్వింటాకు రూ.1.40 కమీషన్

కిలో బియ్యానికి రూ.1.40 చొప్పున క్వింటాకు రూ.140 కమీషన్‌ను ప్రభుత్వం డీలర్లకు చెల్లిస్తోంది. ఇందులో కేంద్రం వాటా 45 పైసలు, రాష్ట్ర వాటా 95 పైసలుగా ఉంది. ఒక డీలర్ నెలలో 250 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేస్తే కమీషన్ రూ.35 వేలు రావాలి. కానీ ఐదు నెలలుగా పెండింగ్ ఉండడంతో నిర్వహణ ఖర్చులకు ఇబ్బందిగా మారినందున డీలర్లు ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. కాగా, జిల్లాలో 748 రేషన్‌షాపులు ఉండగా, 4,52,758 కార్డుల ద్వారా నెలకు 81,45,723 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు.

రేపు వినతిపత్రాలు..

ఐదు నెలలుగా కమీషన్ విడుదల చేయాలని కోరుతూ సోమవారం జిల్లావ్యాప్తంగా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్ కార్యాలయాల్లో వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు డీలర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బానోతు వెంకన్న, షేక్ జానీమియా, నాయకుడు దుర్గయ్య తెలిపారు. ఈమేరకు శనివారం ఖమ్మంలో నిర్వహించిన సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించారు. అయినా స్పందన రాకపోతే డీలర్లు వరుస ఆందోళనలు నిర్వహించే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

పత్తి ఎగుమతుల్లో నకిలీ దందా

నకిలీ పర్మిట్లతో మార్కెట్‌కు పన్ను ఎగవేత

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మం క్రైం: పత్తి ఎగుమతుల్లో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఓ వ్యాపారి చేసిన నకిలీ దందా బయటపడింది. దీంతో ఆయనపై మార్కెట్ బాధ్యులు ఖమ్మం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు... పంట ఉత్పత్తులను కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే వ్యాపారులు మార్కెట్ నుంచి పర్మిట్లు పొందాలి. ఆ పర్మిట్ల ఆధారంగా ఎగుమతి చేస్తూ నిర్ణీత రుసుము మార్కెట్‌కు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, 2023లో ఖమ్మంకు చెందిన మహాలక్ష్మి కాటన్ ట్రేడర్స్ యజమాని మన్నెం కృష్ణయ్యకు మార్కెట్ నుంచి రశీదు పుస్తకం జారీ చేశారు. ఇందులోని ఓచర్ల ద్వారా పత్తిని వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేశాడు. ఆంధ్రప్రదేశ్‌లోని ఓ కంపెనీకి కూడా 1,100 క్వింటాళ్ల పత్తిని ఎగుమతి చేయగా, వారు అనుమానం వచ్చి ఆరా తీయడంతో నకిలీ పర్మిట్‌గా తేలింది. ఇదికాక పలు ఓచర్లతో నకిలీ పర్మిట్ సృష్టించినట్లు తేలడంతో కృష్ణయ్యపై మార్కెట్ కార్యదర్శి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు తెలిపారు. ఈ పర్మిట్ల ఆధారంగా సదరు వ్యాపారి మార్కెట్‌కు రూ.1.50 లక్షల పన్ను చెల్లించాల్సి ఉన్నట్లు తేలగా.. మొత్తం ఎగుమతులను పరిశీలిస్తే ఇది పెరిగే అవకాశముందని సమాచారం. కాగా, చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యాన ఈ విషయం బయటపడడం గమనార్హం.

జ్వరబాధిత విద్యార్థులు ఇంటికి..



విద్యార్థులను పరీక్షిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సీతారాం

సత్తుపల్లి: సత్తుపల్లిలోని మైనార్టీ గురుకులంలో జ్వరాల బారిన పడిన విద్యార్థులను శనివారం ఇళ్లకు పంపించారు. తొలుత గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.అవినాష్ ఆధ్వర్యాన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. జలుబు, దగ్గుతో పలువురు బాధపడుతుండగా మందులు అందజేశారు. ఆపై తల్లిదండ్రులతో ఇళ్లకు పంపించారు. అయితే, వర్షాకాలం సీజన్‌లో దోమలు, ఆపై వ్యాధులు ప్రబలే అవకాశమండగా, గురుకులంలోని కొన్ని గదుల కిటికీల మెష్‌లు తొలగించారు. దీంతో దోమల బెడద పెరిగినట్లు తెలుస్తోంది. కాగా, కల్లూరు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.సీతారాం పాఠశాలలో వైద్యశిబిరాన్ని పరిశీలించారు. అలాగే, పారిశుద్ధ్యం, డైనింగ్‌హాల్, తాగునీటి సరఫరా, వంట గదులను తనిఖీ చేశారు. పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించడమే కాక వేడి ఆహారాన్ని అందించాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ ప్రకారం పదోన్నతులు ఇవ్వాలి

ఖమ్మం సహకారనగర్: రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఉపాధ్యాయ పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని టీజీటీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్, వ్యవస్థాపక అధ్యక్షుడు మాలోతు రామారావు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం కలెక్టరేట్ వద్ద సంఘం నాయకులతో కలిసి నిరసన తెలిపాక అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జనరల్ రోస్టర్‌లో పదోన్నతులు పొందిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ, ఉపాధ్యాయులను కూడా రూల్ ఆఫ్ రిజర్వేషన్ కోటా కింద లెక్కించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.బన్సీలాల్, బి.జగ్గిలాల్‌తో పాటు బాబురావు, ఈర్యా, రవికుమార్, శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

58 జీఓ పట్టాలపై విచారణ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధి 27వ డివిజన్‌లో జీఓ 58 ద్వారా పలువురికి మంజూరైన పట్టాలను అధికారులు మరోసారి పరిశీలిస్తున్నారు. ఈ డివిజన్‌లో 37మందికి పట్టాలు అందగా, 29మందికి ఇళ్లు మంజూరవడంతో వారు నిర్మాణానికి సిద్ధమయ్యారు. అయితే, పట్టాలపై కొందరు కోర్టుకు వెళ్లడం, మాస్టర్ ప్లాన్ కింద ఆ స్థలం రోడ్డు నిర్మాణంలో పోతుండడంతో నిర్వాసితులకు ఇంకోచోట ఇళ్లు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అంతేకాక 27వ డివిజన్‌లో మంజూరైన పట్టాల్లో తేడాలు ఉన్నాయన్న సమాచారంతో అధికారులు విచారణ ప్రారంభించినట్లు తెలిసింది. కాగా, పట్టాలు అందుకున్న వారికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అడ్డంకులు రావడంతో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించనున్నట్లు సమాచారం. ఈమేరకు ఖమ్మం అర్బన్ తహసీల్‌తో పాటు కేఎంసీ కార్యాలయంలో అధికారులు శనివారం పట్టాలను పరిశీలించడమే కాక డివిజన్‌లోనూ క్షేత్ర స్థాయిలో స్థలాలను పరిశీలించారు.

పొలంలో రైతు మృతి



వీరభద్రారెడ్డి (ఫైల్)

కూసుమంచి: పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లిన అక్కడే మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని పాలేరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన యడవెల్లి వీరభద్రారెడ్డి (52) పొలానికి నీళ్లు పెట్టేందుకు ఉదయమే ఇంటి నుంచి వెళ్లాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెళ్లి చూడగా మోటారు వద్ద మృతదేహం పడి ఉంది. వీరభద్రారెడ్డి గుండెపోటుతో మృతిచెందాడని భావిస్తుండగా, ఆయన కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై నాగరాజు తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి

తల్లాడ: తల్లాడ ఎన్టీఆర్‌నగర్ సమీపాన ఈనెల 20న జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని యాచకురాలు చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మండలంలోని గాంధీనగర్ తండా వైపు నుంచి తల్లాడ వైపు వృద్ధురాలు నడిచి వస్తుండగా.. వెంగన్నపేటకు చెందిన జినుగు వెంకటి బైక్‌పై వెళ్తూ ఢీ కొట్టాడు. ఈఘటనలో గాయపడిన ఆమెను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిందని తల్లాడ రెండో ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు.

స్థల వివాదంతో సోదరి ఇంటిపై దాడి

ఖమ్మంఅర్బన్: స్థల వివాదం కారణంగా వివాహిత ఇంటిపై దాడి చేసిన ఆమె సోదరుడు, ఆయన కుమారుడిపై శనివారం ఖమ్మం అర్బన్(ఖానాపురం హవేలీ) పోలీసులు కేసు నమోదు చేశారు. అల్లీపురంలో ప్రమీల, ఆమె సోదరుడు జి.శ్రీను వేర్వేరుగా నివసిస్తున్నారు. గతంలో శ్రీను ఓ కేసులో జైలుకు వెళ్తే బెయిల్ కోసం ప్రమీల రూ.2 లక్షలు ఇచ్చింది. దీనికి ప్రతిఫలంగా ఆయన పేరిట ఉన్న ఇంటి స్థలాన్ని రాశాడు. కానీ ఇప్పుడు స్థలం విలువ పెరగడంతో శ్రీను మళ్లీ తనకే కావాలని పేచీ పెడుతున్నాడు. ఈక్రమంలోనే శ్రీను, ఆయన కొడుకు రాజరత్నం కలిసి శనివారం ప్రమీల ఇంటిపై దాడికి పాల్పడ్డారు. ఆమె ఫిర్యాదుతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కోతుల దాడిలో ముగ్గురికి గాయాలు

వైరారూరల్: వైరామండలంలోని పాలడుగులో కోతులదాడిలో ముగ్గురుగాయపడ్డారు. గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన వనమా సుబ్బారావు, బేబమ్మ ఇంట్లో ఉండగా శనివారం కోతులు జొరబడి దాడి చేశాయి. ఈక్రమాన కోతులను అదిలించేందుకు యత్నించిన మరో వ్యక్తిపైనా దాడి చేయగా గాయపడ్డారు. వీరికి సోమవరంలోని పీహెచ్‌సీలో చికిత్స చేయించారు.

గ్యాస్ లీకేజీతో మంటలు

సత్తుపల్లిరూరల్: ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీక్ కావడంతో మంటలు వ్యాపించాయి. సత్తుపల్లి విద్యానగర్ రోడ్డులో ఓ ఇంట్లో శనివారం వంట చేస్తుండగా గ్యాస్ పైపు లీకేజీతో మంటలు వచ్చాయి. దీంతో అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. వారు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈఘటనలో గృహిణి రత్నకుమారికి స్వల్ప గాయాలయ్యాయి.